7

సాక్షి
జగిత్యాల

సోమవారం ı 15 ı జనవరి ı 2024



కరీంనగర్‌లోని శాతవాహన అపార్ట్‌మెంట్‌లో భోగిమంటలు..



న్యూస్‌రీల్

దశలవారీగా అభివృద్ధి పనులు పూర్తి చేస్తాం



గంభీర్‌పూర్‌లో మాట్లాడుతున్న శ్రీనివాస్

కథలాపూర్(వేములవాడ): నియోజకవర్గంలోని సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం కథలాపూర్ మండలం గంభీర్‌పూర్, బొమ్మెన గ్రామాల్లో కృతజ్ఞత సభ ర్యాలీలో పాల్గొన్నారు. సూరమ్మ ప్రాజెక్టు, గంభీర్‌పూర్ శివారులోని కొచ్చెరువు మరమ్మతు, తాండ్ర్యాల– గంభీర్‌పూర్ వంతెన మరమ్మతుకు నిధులు కేటాయిస్తామన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కాయితి నాగరాజు, పీసీసీ కార్యవర్గ సభ్యుడు తొట్ల అంజయ్య, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జవ్వాజి చౌదరి, నాయకులు పాల్గొన్నారు.

నృసింహుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే అడ్లూరి



ధర్మపురిలోని నృసింహుడి సన్నిధిలో ప్రభుత్వ విప్ పూజలు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామిని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ దర్శించుకున్నారు. దేవస్థానం పక్షాన ఆయనకు స్వాగతం పలికారు. ఆలయ సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ స్వామివారి శేషవస్త్రం కప్పి చిత్రపటం, ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో వేదపండితులు బొజ్జ రమేశ్‌శర్మ, అర్చకులు పాల్గొన్నారు.

మండలానికో ఇంటర్‌నేషనల్ స్కూల్ ఏర్పాటు



ఎల్లమ్మ ఆలయం వద్ద ఎమ్మెల్సీ

సారంగాపూర్: ప్రతి మండలానికో ఇంటర్‌నేషనల్ స్కూల్ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. ఇందుకు ప్రతి మండలంలో 10 ఎకరాల స్థల సేకరణ చేస్తున్నట్లు వెల్లడించారు. సారంగాపూర్ మండలంలో బట్టపల్లి లేదా పోతారంలో ఇంటర్‌నేషనల్ స్కూల్ ఏర్పాటుకు 10 ఎకరాల స్థలం సేకరించాలని రెవెన్యూ అధికారులను కోరామన్నారు.

దేవాలయ నిర్మాణానికి కృషి

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం కన్నాపూర్‌లో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న రేణుక ఎల్లమ్మ ఆలయాన్ని ఎమ్మెల్సీ పరిశీలించారు. ఆలయానికి ప్రహరీ, బోర్వెల్‌కు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

దుబాయ్‌లో సంక్రాంతి సంబురాలు



జగిత్యాల రూరల్: సంక్రాంతి పండుగను గల్ఫ్ దేశాల్లో ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. దుబాయ్‌లో ఎతిసలాత్ అకాడమీ షోనాపూర్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఓమన్, ఖత్తర్‌లోనూ తెలంగాణ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. పిండి వంటలను అతిథులకు రుచిచూపించారు.



జగిత్యాలలో ముగ్గు వేస్తున్న మహిళ



సంక్రాంతి సందడి

ఘనంగా భోగి
ఆనందాల సంక్రాంతి

భోగి వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. మహిళలు ఉదయమే వాకిళ్లను శుభ్రం చేసుకుని ముగ్గులు వేశారు. గొబ్బెమ్మలు, రేగుపండ్లు పోసి కట్టెల పొయ్యిపై పాలు పొంగించారు. సంస్కృతిని కాపాడుదాం.. ఆడపిల్లలను రక్షించుకుందాం. యువశక్తిని ప్రోత్సహిద్దాం వంటి సందేశాలతో కూడిన ముగ్గులు వేశారు. నేడు సంక్రాంతి - జగిత్యాలటౌన్





కరీంనగర్‌లో భోగిపండ్లు పోస్తున్న మహిళ



భోగి పాలు



జగిత్యాల జిల్లాకేంద్రంలో ఆకట్టుకున్న ముగ్గు



జగిత్యాల జిల్లాకేంద్రంలో సందేశాలతో కూడిన ముగ్గు

ఆస్పత్రిలో అందరూ డెప్యూటేషనే..!

- మంజూరుకాని వైద్య పోస్టులు
- ఏర్పాటు కాని హెచ్‌డీసీ
- పనిచేయని పరికరాలు
- పట్టించుకోని వైద్య విధాన పరిషత్
- రాయికల్ సామాజిక ఆసుపత్రి తీరు



ఒకే గదిలో వైద్య సేవలందిస్తున్న ముగ్గురు డాక్టర్లు



రాయికల్ ఆస్పత్రి

రాయికల్: రాయికల్‌లోని కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌ను రెండేళ్ల క్రితం వైద్య విధాన పరిషత్‌లోకి మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇంతవరకు బాగానే ఉన్నా.. ఆసుపత్రికి సరిపడా సిబ్బంది, వైద్య పోస్టులను మాత్రం నేటికీ మంజూరు చేయలేదు. ఇక్కడ పనిచేస్తున్న వారంతా డెప్యూటేషన్‌పై వచ్చినవారే. పర్యవేక్షించాల్సిన హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ (హెచ్‌డీసీ) లేకపోవడంతో రోగులకు వైద్యం అందడం గగనంగా మారుతోంది.

గ్రామీణుల కోసం..

పట్టణంతోపాటు, మండలంలోని 32 గ్రామాల్లోని నిరుపేదలకు వైద్యసేవలందించేందుకు రాయికల్‌లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను 2022 జూన్‌లో వైద్య విధాన పరిషత్ కిందకు అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అప్‌గ్రేడ్ అయినప్పటికీ వైద్యులు, స్టాఫ్ మంజూరు చేయకపోవడంతో వైద్యులంతా డెప్యూటేషన్‌పై వచ్చి విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం సూపరింటెండెంట్ రవి మత్తు డాక్టర్, స్త్రీ వైద్య నిపుణురాలు ఒడ్నాల రజిత, పిల్లల వైద్య నిపుణురాలు శిల్ప, ఈఎన్‌టీ రమేశ్, రేడియాలజిస్ట్ సురేందర్, మెడికల్ ఆఫీసర్ తేజస్విని, మెడికల్ ఆఫీసర్ ఉదయ్, పిల్లల వైద్య నిపుణులు శశికాంత్‌రెడ్డి, దంత వైద్య నిపుణులు ప్రవీన్‌చంద్ర పనిచేస్తున్నారు. వీరిలో డాక్టర్ తేజస్విని, డాక్టర్ ఉదయ్, డాక్టర్ శశికాంత్ మాత్రమే రెగ్యులర్ వైద్యులు. మిగిలిన వారంతా డెప్యూటేషన్‌పై వచ్చినవారే. దంత వైద్య నిపుణులు ప్రవీణ్‌చంద్ర గతేడాది నుంచి మేడిపల్లికి డెప్యూటేషన్‌పై వెళ్లడంతో ఇక్కడ దంత వైద్యం కరువైంది. ఏడుగురు స్టాఫ్‌నర్సు, ఒక హెడ్ నర్సు సైతం జిల్లా కేంద్రం నుంచి వచ్చినవారే.

ఆస్పత్రిలో పనిచేయని పరికరాలు

రాయికల్ వైద్య విధాన పరిషత్ ఆస్పత్రిలో ఆపరేషన్‌కు అవసరమయ్యే జనరేటర్, ఈసీజీ మిషన్, పల్స్ ఆక్సీమీటర్, శాంక్షన్‌మిషన్, ఆపరేషన్ థియేటర్‌లో లైట్లు సరిగా పనిచేయకపోడంతో ప్రసవాల సంఖ్య తగ్గుతోంది. అంతేకాకుండా ఈఎన్‌టీకి సంబంధించిన హెడ్‌లైట్ పరికరాలు లేవు. రేడియాలజీకి సంబంధించిన పోర్టబుల్ మిషన్ పెద్దదిగా లేకపోవడంతో వైద్యులు నామమాత్రంగా వచ్చి విధులు నిర్వహించే పరిస్థితి నెలకొంది.



ఆపరేషన్ థియేటర్‌లో సరిగా పనిచేయని లైట్లు



పనిచేయని ఆటోక్లేవ్ పరికరాలు

ఆస్పత్రిలో సమస్యల తాండవం

ఏళ్ల క్రితం నిర్మించిన ఆస్పత్రిలో డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేదు. విద్యుత్ సౌకర్యం మెరుగుపర్చలేదు. ఆపరేషన్ సమయంలో.. రాత్రివేళ.. వర్షం కురిసిన సమయాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇంటర్నెట్ సౌకర్యం లేకపోవడంతో వైద్య సిబ్బంది సమాచారం ఇవ్వలేక ప్రైవేట్ నెట్‌ను వాడుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఆస్పత్రిలో గదుల కొరత తీవ్రంగా ఉంది. ఉన్న గదుల్లోనే ఇద్దరు లేదా ముగ్గురు డాక్టర్లు రోగులకు పరీక్షలు చేస్తున్నారు.

హెచ్‌డీసీకి మోక్షమెప్పుడో..?

ఆస్పత్రిని పర్యవేక్షించాల్సిన హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీకి మోక్షం కలగడం లేదు. రెండేళ్లుగా ఆస్పత్రిలో డెవలప్‌మెంట్ కమిటీ హెచ్‌డీసీ ఏర్పాటు కాకపోవడంతో ప్రభుత్వం నుంచి ఆస్పత్రి అభివృద్ధికి మంజూరైన నిధులకు మోక్షం కలగడం లేదు. ఇందులో ఎమ్మెల్యే, ఎంపీపీ, మున్సిపల్ చైర్మన్, ఎస్డీవో, మహిళా మండలి సభ్యులు, ఎంపీటీసీలు సభ్యులుగా ఉంటారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి స్పందించి ఆస్పత్రిలో డాక్టర్లను నియమించి ఆస్పత్రి అభివృద్ధికి నిధులు మంజూరుచేయడంతోపాటు, వసతుల కల్పనకు కృషి చేయాలని పట్టణ, మండల ప్రజలు కోరుతున్నారు.

వసతులు కల్పించాలి



రాయికల్ ఆస్పత్రిలో వైద్యులను పూర్తిస్థాయిలో నియమించి అన్ని రకాల వసతులు కల్పించాలి. ముఖ్యంగా డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో వచ్చిన రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

– అనుపురం శ్రీనివాస్‌గౌడ్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం



రాయికల్ ఆస్పత్రిలో క్యాడర్ స్ట్రెంత్ విషయంపై ఉన్నతాధికారుల దృష్టికి ఇటీవల నివేదించాం. ఆస్పత్రిలో మెరుగైన వసతుల కోసం కృషి చేస్తున్నాం. వైద్యుల పనితీరుపై ఎప్పటికప్పుడు నిఘా పెడుతున్నాం.

– సుదక్షిణదేవి, జిల్లా సూపరింటెండెంట్

అటవీ ప్రాంతాల్లో కోడి పందాలు



- గుట్టుచప్పుడు కాకుండా నిర్వహణ
- ఆంధ్రా సెటిలర్సే అధికం..

కోరుట్ల: అటవీ ప్రాంతాల్లో గుట్టుచప్పుడు కాకుండా కోడిపందాల జోరు సాగుతోంది. జిల్లాలోని కొన్నిచోట్ల ఎక్కువ మొత్తంలో సెటిల్ అయిన ఆంధ్రామేస్త్రీలు, స్థానికులు కొందరు సంక్రాంతి సందర్భంగా కోడి పందాల జోరును కొనసాగిస్తున్నారు. నాలుగైదు రోజులుగా జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో బెట్టింగ్‌లు పెట్టి మరీ కోడిపందాలు నిర్వహిస్తుండటం గమనార్హం. గతంలో పలుమార్లు సంక్రాంతి సందర్భంగా జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి పరిసరాల్లో కోడిపందాలు నిర్వహిస్తున్న వారిని జిల్లా పోలీసులు అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేసిన సందర్భాలు ఉన్నాయి.

మారుమూల అటవీప్రాంతాలే వేదిక

కోడిపందాల విషయంలో పోలీసుల నిఘా పెరిగిపోయిన క్రమంలో జిల్లాలోని అటవీ ప్రాంతాలతోపాటు జగిత్యాల, నిర్మల్ జిల్లా సరిహద్దుల్లో వీటి నిర్వహణ కొనసాగుతున్నట్లు సమాచారం. గతంలో కోడి పందాలు నిర్వహించిన ఏరియాల్లో ప్రస్తుతం పోలీసులు నిఘా పెట్టగా ఆయా ప్రాంతాలను మార్చి ఇతర ఏరియాల్లో పందాలు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. పందాల కోసం పెంచిన కోళ్ల కాళ్లకు కత్తులు కట్టి బరిగీసి ఉసిగొల్పి కోడిపందాలు నిర్వహిస్తున్నారు. కోడిపందాల్లో పాల్గొనే వారు తమ తమ కోళ్లపై రూ.500 నుంచి రూ.5వేల వరకూ బెట్టింగ్‌లు పెడుతున్నట్లు తెలిసింది.

పందాలకు కోళ్ల పెంపకం..

సంక్రాంతి సందర్భంగా కోడిపందాల నిర్వహణకు జిల్లాలోని కొంతమంది నిర్వాహకులు ప్రత్యేకంగా కోళ్లను పెంచుతున్నట్లు సమాచారం. ఈ కోళ్లకు జీడిపప్పు, శనగలు, మక్కలు వంటి ఆహారాన్ని పెడుతూ బలిష్టంగా తయారు చేస్తున్నారు. కోరుట్ల మండలంలోని ఓ గ్రామంలో రెండు నెలల క్రితం కోడి పందాల నిర్వాహకులు ఇలా పెంచిన పందెం కోళ్లను ఓ కానిస్టేబుల్ స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఇలాంటి కోళ్లను ఒక్కొక్కటి రూ.3వేల నుంచి రూ.5వేల ధరకు అమ్ముతున్నారు. ఎక్కువగా ఆంధ్రా సెటిలర్స్ ఈ కోళ్లను పెంచుతున్నట్లు తెలిసింది. ఈ రీతిలో పెంచుతున్న కోడిపంజులతో సంక్రాంతికి వారం నుంచి పది రోజుల పాటు కోళ్ల పందాలు సాగిస్తున్నట్లు సమాచారం.



కోడి పందాలు సాగే ప్రాంతాలు

- మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం మండలాల సమీపంలోని నర్సింహుల గుట్ట
- కోరుట్ల మండలం యూసుఫ్‌నగర్ పులిగుట్టల ఏరియా
- గొల్లపల్లి మండలంలోని ఓ మారుమూల గ్రామం.
- రాయికల్ మండలంలోని గోదావరి తీరంలోని ఓ గ్రామం
- ఇబ్రహీంపట్నం, నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పెల్లి సరిహద్దు అటవీ ప్రాంతం.

సమాచారం ఇవ్వండి

కోడి పందాల నిర్వహించడం చట్టవిరుద్ధం. ఈ ప్రాంతంలో కోడి పందాలు నిర్వహిస్తున్న అంశం మా దృష్టికి రాలేదు. ఇప్పటికే పూర్తిస్థాయిలో నిఘా పెట్టాం. ఏదైనా సమాచారం ఉంటే మా దృష్టికి తీసుకువస్తే చర్యలు తీసుకుంటాం.

– రవీందర్‌రెడ్డి, డీఎస్పీ మెట్‌పల్లి

సకల శుభాలు కలగాలి

“



గొల్లపల్లి(ధర్మపురి): ఈ సంక్రాంతి నుంచి ప్రజలకు సకల శుభాలు కలగాలి. అందరికీ మకర సంక్రాంతి శుభాకాంక్షలు. ప్రతీ ఇంట్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలి. ప్రజలహితానికి, ప్రగతి పథానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది. ధర్మపురి నియోజకవర్గంలో సంక్షేమంతోపాటు అభివృద్ధి వెలుగులు విరజిమ్మాలి.

– ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్

పండుగ కార్యకర్తలతోనే..



కోరుట్ల: ఏటా సంక్రాంతికి కుటుంబసభ్యులతో సంతోషంగా గడిపేవాన్ని. ఈసారి మాత్రం ప్రజలు, బీఆర్‌ఎస్ కార్యకర్తలతో గడపడానికే ప్రాధాన్యం ఇచ్చాను. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో కలిసి దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే తమ్ముడు శశివర్ధన్‌రెడ్డి దశదిన కర్మ కార్యక్రమానికి వెళ్లా. అందరికీ పండుగ శుభాకాంక్షలు.

– కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్

సంస్కృతిని గౌరవించాలి



సుల్తానాబాద్: సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిఒక్కరూ గౌరవించాలని, పండుగల విలువను భావితరాలకు తెలిపే బాధ్యత మనందరిపై ఉంది. ఆదివారం సుల్తానాబాద్ మండల కేంద్రంలోని గాంధీనగర్‌లో భోగి వేడుకలకు హాజరయ్యా. కష్టాలు తొలగి, విజయం వైపు అడుగులు వేసేలా భగవంతుడు ప్రజలందరినీ ఆశీర్వదించాలి.

– పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు

కొత్త కాంతులు నింపాలి



గోదావరిఖని(రామగుండం) : పాత నిర్బంధపు చీకట్లను రూపుమాపి, సంక్రాంతి పండుగ అందరి కుటుంబాల్లో కొత్త కాంతులు నింపాలి. ఆదివారం మా నివాసం వద్ద నా సతీమణి మనాలిఠాకూర్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి భోగి మంటలు వేశాం. సంక్రాంతి పండుగను ప్రజలు ఆనందంగా జరుపుకోవాలి.

– రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

అందరి జీవితాల్లో సంతోషం నింపాలి



వేములవాడ: సంక్రాంత్రి పండుగ అందరి జీవితాల్లో సుఖసంతోషాలు నింపాలి. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండాలి. పండుగను ప్రజలు ఆనందంగా జరుపుకోవాలి.నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు.

– ఆది శ్రీనివాస్, వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్

షార్ట్ సర్క్యూట్‌తో చెప్పుల దుకాణం దగ్ధం



మంటలు ఆర్పుతున్న స్థానికులు

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు గుట్టకింది ప్రాంతంలో ఆదివారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. పూడూర్ గ్రామానికి చెందిన శంకర్ గుట్ట కింద కొద్దిరోజులుగా చెప్పుల దుకాణం నిర్వహిస్తున్నాడు. ఆదివారం దుకాణం మూసి వేసి ఉండటంతో మంటలు దుకాణమంతా వ్యాపించాయి. స్థానికులు గమనించి మంటలు ఆర్పడానికి ప్రయత్నించారు. ఫైరింజన్ చేరుకుని మంటలను ఆర్పివేశారు. సుమారు రూ.రెండులక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు యజమాని తెలిపారు.







పందెం కోడి

- చిన్నప్పటి నుంచే ఖరీదైన తిండి
- ప్రత్యేక దృష్టి.. స్పెషల్ ట్రైనింగ్

సాక్షి, కరీంనగర్ డెస్క్: సంక్రాంతి తెలుగింట పెద్దపండుగ. భోగింటలు.. ముగ్గులు.. పిండివంటలు.. పతంగులే కాదు.. కోడి పందాలు ఓ భాగమే. పందెం కోళ్లను పెంచడానికి చాలాజాగ్రత్తలు తీసుకుంటారు. ఆ కోళ్లను సొంత బిడ్డల్లా పెంచుతారు. ఈత నేర్పడం.. వేడినీళ్ల స్నానం.. బాదం.. పిస్తా పప్పులు.. కోడి గుడ్డు సొన.. మధ్యాహ్నం భోజనంలో ఉడికించిన వేట మాంసం.. కీమా లడ్డూలు.. డిన్నర్ తర్వాత ఖరీదైన బి-కాంప్లెక్స్ గోలీలు.. దాహం వస్తే మినరల్ వాటర్ ఇస్తారు. సంక్రాంతి మూడు రోజులే.. కానీ.. పందెపు కోళ్లకు మూడు నెలల ముందు నుంచే పండుగ. అసలు సిసలు పందెం పుంజులకోసం. పోరాడే సత్తా ఉన్న కోడిపెట్టతో మరో కోడిపుంజును జతచేసి ఒకచోట ఉంచుతారు. నెల రోజుల తర్వాత ఆ గుడ్లను పొదిగిస్తారు. వాటిలో మంచి లక్షణాలున్న పుంజు పిల్లను ఎంపిక చేసి ఏడాదిపాటు అత్యంత శ్రద్ధతో పెంచుతారు.

పోషకాల తిండి..

రోజువారీ అయితే చోళ్లు, రాగులు, గంట్లు వంటి అపరాలే. స్పెషల్ ఫుడ్ అంటే బాదం, కోడిగుడ్డులోని తెల్లసొన. పందాలకు 15 రోజుల ముందు నుంచి రోజూ ఉడికించిన మాంసపు విందు. అదనంగా బి-కాంప్లెక్స్ గోలీలు.



- **పుంజు ఖరీదు లక్షల్లోనే..**

సాధారణ పందెపు కోడి రూ. 10 నుంచి 20 వేల వరకు ఉంటే.. జాతికోళ్ల ధర రూ.25 వేల నుంచి 50 వేల వరకు ఉంటుంది. ఒకటిరెండు పందాల్లో గెలిచిన చరిత్ర ఉండే పుంజులు లక్ష కూడా పలుకుతాయి. ఒక్కో పుంజుకు దాని జాతిని బట్టి నెలకు రూ.3 నుంచి రూ.5 వేల వరకు తిండికి ఖర్చు చేస్తారు. అనుభవం ఉన్న జీతగాళ్లు ఉంటారు.

- **స్పెషల్ ట్రైనర్లు...**

కోళ్లకు తర్ఫీదు ఇచ్చేందుకు కోల్‌కతా నుంచి స్పెషల్ ట్రైనర్లు ఉంటారు. పండుగకు 15 రోజుల ముందు రంగంలోకి దిగుతారు. ఉభయ గోదావరి జిల్లాలకే ఈ తరహా స్పెషల్ కోచ్‌లు సుమారు వంద నుంచి రెండు వందల మంది వస్తుంటారు.

- **కోడి ఎంపిక శాస్త్రబద్ధం..**

ఏ రాశిలో ఏ జాతి పుంజు పందెం కొడుతుందో తెలుసుకోవడానికి కుక్కుట శాస్త్రాలు అనుసరిస్తారు. కాకి, డేగ, నెమలి, తీతువ, పర్ల, పెట్టమారు, పింగ్ల, పచ్చకాకి, అబ్రాస్, రసంగి, పువ్వుల, కొక్కిరాయి వంటి వాటిని ఒకదానిపై ఒకటి ఎత్తుగడగా ఎంచుకొని బరిలోకి దింపుతారు. బరిలో దిగిన పుంజుల రంగుల్ని బట్టి గెలుపోటములను అంచనా వేసి పందాలు కాస్తారు.

- **సీక్రెట్ ఇదీ..**

పుంజుల వంశావళి వివరాలు ఎంతో రహస్యం. బయటకు పొక్కితే అంతకన్నా మేలు రకం పుంజులను ప్రత్యర్థులు బరిలోకి దింపుతారు. పందాలు ముగిసేవరకు పుంజులకు బ్రహ్మచర్య వ్రతం తప్పదు. తదనుగుణంగా వాటి యజమానులు జాగ్రత్తలు తీసుకుంటారు.

- **కత్తుల సమరం..**

కోస్తా జిల్లాల్లో రెండు రకాల పందాలు జరుగుతాయి. చూపుడు పందాల్లో అక్కడికి వచ్చిన పందెంరాళయుళ్లు తమతమ పుంజులను చూపించుకొని వారిద్దరూ ఇష్టపూర్వకంగా నచ్చిన మొత్తానికి పందెం వేస్తారు. ఎత్తుడు.. దింపుడు పందెం రెండు వర్గాల మధ్య జరుగుతుంది. పందెం మొత్తం, సంఖ్యను ముందు నిర్ణయించుకుంటారు. ఒక వర్గం వారు తమ కోడి పుంజును బరిలో దిపంగానే.. రెండో వర్గం వారు కూడా తమ పుంజును దింపుతారు. పందెంరాయుళ్లు తమకు నచ్చిన పుంజుపై పందెం కాస్తారు. మళ్లీ రెండో వర్గం వారు బరిలో దింపిన పుంజుపై మొదటి వర్గం వారు తాము ఎంచుకున్న పుంజును బరిలోకి దింపుతారు. ఇలా వరుసగా ముందు అనుకున్నన్ని పందేలు నిర్వహిస్తారు. గతంలో కోళ్లకు కత్తులుండేవి కాదు. రోజుల తరబడి కొట్లాడుకున్నాక చివరి వరకు నిలచిన పుంజు గెలిచినట్లు ప్రకటించేవారు. ఈ మధ్య కత్తియుద్ధాలే ఎక్కువగా జరుగుతున్నాయి. పందేలపై ఎకరాల కొద్దీ భూములు, లక్షలాది రూపాయల మొత్తాన్ని పణంగా పెడుతుంటారు. పందెంలో పుంజు గెలిస్తే లభించే పేరు.. ప్రఖ్యాతల కోసం ఇంకా ఎక్కువ ఖర్చు చేయడానికైనా వెనుకాడరు.

- **మాంసానికి యమ క్రేజ్..**

పరాజయం పాలై నెత్తురోడుతూ నేలరాలిన కోడిని కోస మాంసంగా పిలుస్తారు. దీనికి క్రేజ్ ఎక్కువ. కోస మాంసం ధర రూ. రెండు వేల నుంచి రూ.మూడు వేల వరకు పలుకుతుంది. అయితే కోసమాంసాన్ని అమ్మేవారు తక్కువ. ఇంటిల్లిపాది కలిసి తినడం, ఆత్మీయులకు పంపడం చేస్తుంటారు.

- **ఉమ్మడి జిల్లాలో జోరు..**

ఒకప్పుడు పందెం కోళ్ల పెంచడం.. పందేలు ఆడడం ఆంధ్రాకే పరిమితం. ఇప్పుడు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో చాలాచోట్ల పందెం కోళ్లను పెంచుతున్నారు. వివిధ ప్రాంతాల నుంచి పిల్లకోళ్లను ఇక్కడికి దిగుమతి చేసుకొని ఫాంలు నడుపుతున్నారు. ఆరునెలల కోడి మొదలు ఏడాది వయసున్న కోళ్లను నేరుగా.. ఆలన్‌లైన్ ద్వారా పందెంరాయుళ్లకు అమ్ముతున్నారు. అంతేకాదు.. జిల్లాలో కొన్నిచోట్ల పందేలు కాస్తున్నట్లు సమాచారం.

చిన్నప్పటి నుంచే శిక్షణ..

ఉదయాన్నే కాలువలు.. చెరువుల్లో ఈత. ఎండలో సుమారు రెండుగంటపాటు ఆరనివ్వడం. ఆయాసం వచ్చి పడిపోతే కఫం బయటకు వచ్చేలా నోట్లో నీరు పోసి సొంగకొట్టడం. నిత్యం మసాజ్ సదుపాయం కూడా.. ఆరోగ్యంగా ఉండేందుకు, బద్ధకం వీడేందుకు ఉదయాన్నే ఆవిరి పట్టడం. దోమలు కుట్టకుండా ఫ్యాన్ల ఏర్పాటు ఉంటుంది.



రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

జగిత్యాలక్రైం: జిల్లాకేంద్రంలోని గాంధీనగర్ సమీపంలో శనివారం అర్ధరాత్రి ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డు కింద పడి గూడబోయిన బాలరాజు(22) అక్కడికక్కడే మృతి చెందాడు. నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండలం బాషీరాబాద్ గ్రామానికి చెందిన గూడబోయిన బాలరాజు, అతడి స్నేహితుడు తక్కడి నవీన్ పని నిమిత్తం ద్విచక్రవాహనంపై జగిత్యాలకు వస్తున్నారు. జగిత్యాల శివారులోని గాంధీనగర్ వద్ద బైక్ అదుపు తప్పి రోడ్డుకింద పడటంతో బాలరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. నవీన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మృతుడి తల్లి సాయమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

కారు ఢీకొని ఒకరి మృతి

మేడిపల్లి: కారు ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన ఆదివారం మండలకేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై శ్యాంరాజ్ కథనం ప్రకారం.. మండలంలోని కాచారం గ్రామానికి చెందిన కొప్పెర మోహన్‌రెడ్డి(58) పెట్రోల్ కోసం మండలకేంద్రంలోని ఓ పెట్రోల్ బంక్‌కు వస్తున్నాడు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న కారు మోహన్‌రెడ్డిని ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మోహన్‌రెడ్డికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

జగిత్యాలక్రైం: జగిత్యాల అర్బన్ మండలం హస్నాబాద్ శివారులో జగిత్యాల-నిజామాబాద్ ప్రధాన రహదారిపై ద్విచక్రవాహనం నుంచి కిందపడిన గడ్డం సుమలత(34) చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండలం కోలాపూర్ గ్రామానికి చెందిన సుమలత ఈనెల 7న జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లిలోని పుట్టింటికి తండ్రి పిట్టల గంగారాంతో కలిసి ద్విచక్ర వాహనంపై వస్తోంది. హస్నాబాద్ శివారులోని ఏఆర్ ఫంక్షన్ హాల్ వద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడింది. ఈ ఘటనలో సుమలతకు తల, ఛాతిలో బలమైన గాయాలయ్యాయి. స్థానికులు జగిత్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చేర్పించారు. అక్కడి వైద్యులు ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. సుమలత భర్త రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

నిజాయితీకి గుర్తింపు

- నలిమెల భాస్కర్



శ్రీనివాస్ దంపతులను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, పాత్రికేయులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): సమాజ సంక్షేమానికి నిజాయితీగా పనిచేసేవారికి ఏ రంగంలోనైనా గుర్తింపు ఉంటుందని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నలిమెల భాస్కర్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని నారాయణపూర్‌కు చెందిన బొల్గం శ్రీనివాస్ సీఎం రేవంత్‌రెడ్డి పీఆర్వోగా నియమితులై మొదటిసారి ఆదివారం స్వగ్రామానికి వచ్చారు. ఈ సందర్భంగా స్థానిక పాత్రికేయులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఆత్మీయ అభినందన సభ ఏర్పాటు చేశారు. ముందుగా శ్రీనివాస్ దంపతులను సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నలిమెల భాస్కర్ మాట్లాడుతూ.. నారాయణపూర్ గ్రామం కవులు, కళాకారులు, విద్యావేత్తలు, ఉద్యోగులకు పుట్టినిల్లని అన్నారు. ఈ మట్టిలో పుట్టిన ప్రతీ బిడ్డ ఏదో ఒక రంగంలో రాణిస్తున్నారని పేర్కొన్నారు. అటెండర్ నుంచి ఐఏఎస్ వరకు ఉన్నత స్థానాలు సాధించినవారు ఉండగా.. ప్రస్తుతం సీఎం పీఆర్వోగా శ్రీనివాస్ నియామకం కావడంతో గ్రామానికి రాష్ట్రస్థాయిలో గుర్తింపు వచ్చిందన్నారు. బొల్గం శ్రీనివాస్ మాట్లాడుతూ.. జర్నలిజం కత్తిమీద సాములాంటిదని, ఈ వృత్తిలో ఎన్ని కష్టాలు ఉంటాయో.. అంత ఎంజాయ్ చేయవచ్చన్నారు. కలుషితం కాకుండా వృత్తినే దైవంగా భావించి, పనిచేసే వారికి అనేక అవకాశాలు వస్తాయని తెలిపారు. సీఎం పీఆర్వో ఊహించని అవకాశమని, దీన్ని సమాజ మంచి కోసం వినియోగిస్తానన్నారు. పురిటిగడ్డ రుణం తీర్చుకోవడానికి వైద్యం, అభివృద్ధిపరంగా తన సాయశక్తులా కృషి చేస్తానన్నారు. మండల విలేకరి నుంచి సీఎం పీఆర్వోగా ఎదిగిన క్రమంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నానని, కుటుంబానికి సైతం సమయం కేటాయించకుండా నిబద్ధతతో పని చేశానని తెలిపారు. ఆ కష్టానికి ప్రతిఫలమే ఈ అవకాశమన్నారు. కార్యక్రమంలో ప్రముఖ కవి జూకంటి జగన్నాథం, డీపీఆర్వో మామిండ్ల దశరథం, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు ఎలుసాని ప్రవీణ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ బుర్క గోపాల్, సర్పంచ్ నిమ్మ లక్ష్మి, ఎంపీటీసీ అపేరా సుల్తానా, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు గౌస్, డీఎస్‌వో పాముల దేవయ్య, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

























